# పరిమళించిన స్నేహం

ప్రసాద్, పరిమళరావు చిన్నప్పట్నుంచీ మంచి స్నేహితులు, ఇద్దరూ పోటీపడి చదివేవారు. పరిమళరావుది కొంచెం ధనవంతుల కుటుంబం. ప్రసాద్‌ది మధ్యతరగతి కుటుంబం, ఎక్కువసార్లు పరిమళ్ ప్రసాద్ ఇంట్లోనే చదివేవాడు. ప్రసాద్ అమ్మగారు కూడా వీళ్ళ యిద్దరికి బేధం చూపించేవారు కాదు. పొద్దున్నే కాఫీ వీళ్ల ఇద్దరికీ యిచ్చి, తర్వాత మిగిలిన వారికి ఇచ్చేవారు. రాత్రంతా ప్రసాద్ ఇంట్లోనే చదువుకుని అక్కడే పడుకునేవాడు పరిమళ్.

ఇద్దరూ ఎం.ఏ.,ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారు. ఉద్యోగ ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ప్రసాద్‌కి ఒక కంపెనీలో ఉద్యోగం వచ్చింది. క్యాష్ బాధ్యతగల ఉద్యోగం అవడం వలన ఏభై వేలు సెక్యూరిటీ డిపాజిట్ కట్టమన్నారు. వాళ్ళిచ్చిన గడువు లోపల, ఆ డబ్బు సర్దుబాటు కాలేదు ప్రసాద్‌కి. పరిమళ్ నాన్నగార్ని సహాయం అడిగాడు. ఓ రెండ్రోజుల్లో ఏ విషయం చెపుతానన్నారు ఆయన.

పరిమళ్‌తో అతని నాన్నగారు - "డిపాజిట్ కట్టడానికి డబ్బు ఎలాగూ లేదు కనుక ప్రసాదు ఆ ఉద్యోగం ఎలాగూ వదిలేస్తాడు. అందులో నువ్వు ప్రవేశించు" అన్నాడు.

"చిన్నప్పట్నుంచీ అన్నదమ్ముల్లా పెరిగాం! పైగా ప్రసాద్ కుటుంబ పరిస్థితి కూడా ఆర్థికంగా అంతంత మాత్రమే! వాడికి సహాయం చేద్దాం" అన్నాడు పరిమళ్.

"కలసి చదువుకున్నంత మాత్రాన ఏదైనా అవకాశం వస్తే జారవిడుచుకోవడం తెలివితక్కువ పని. నిన్ను ప్రసాద్ స్వార్థపరుడిగా తలచవచ్చు! ఒక్క ప్రసాద్ ఏమిటి, చాలా మంది అలాగే అనుకోవచ్చు. ఆ కంపెనీలో నా ఫ్రెండ్ కూడా పని చేస్తున్నాడు. రేపు నే వెళ్ళి ఆ కంపెనీ వాళ్ళతో మాట్లాడతాను. నువ్వు ఆలస్యం చెయ్యకుండా అందులో చేరిపో..." అన్నారు పరిమళ్ నాన్నగారు.

ఆయన చెప్పినట్లే ఆ ఉద్యోగంలో ప్రవేశించాడు పరిమళ్.

తను ధన సహాయం అడిగితే చెయ్యకుండా, పరిమళ్ ఉద్యోగంలో ప్రవేశించిన విషయం తెలిసి ప్రసాద్ చాలా బాధపడ్డాడు. ఈ విషయం తన తల్లితో చెప్తే ఆవిడ "కొంతమందికి పరిమళం పేరులోనే వుంటుంది. కొంతమందికి హృదయంలో వుంటుంది. ఏం బాధపడకు! హృదయంలో పరిమళం ఉన్నవారు ఎప్పటికైనా రాణిస్తారు" అంది.

అక్కడే వున్న ప్రసాద్ నాన్నగారు అన్నారు - అయినా వాళ్ళది ముందునుంచి వ్యాపార వృత్తి-ప్రవృత్తి కూడా! ఈ రోజుల్లో మానవతా విలువలు పోయాయి! అందుకే ప్రేమానురాగాలకీ, స్నేహాలకీ ప్రాముఖ్యత తగ్గిపోయింది. ఏం బాధపడకు! నువ్వు ఢిల్లీ వెళ్దువుగాక! అక్కడ నా చిన్ననాటి స్నేహితుడు వున్నాడు. అతను నీకు ఉద్యోగం ఇప్పిస్తాడు. మా పాత కాలం స్నేహాలు యీనాటి మీ స్నేహాలు లాంటివి కావు."

ప్రసాద్ ఢిల్లీ వెళ్లి వాళ్ల నాన్నగారి స్నేహితుని సహాయంతో ఉద్యోగంలో ప్రవేశించాడు.

"ఈ చిన్న చిన్న ఉద్యోగాలు నమ్ముకోకు! నువ్వు సివిల్స్‌రాయి తప్పకుండా నీకు సెలక్షన్ వస్తుంద"ని ఉత్తేజపరిచారు, అందరూ ఉన్నతంగా వుండాలని ఆయన కోరిక.

కష్టపడి ప్రసాద్ సివిల్స్ రాసాడు. రాత పరీక్షల్లోనే తప్పాడు.

"ఒక్కసారి సివిల్స్‌లో తప్పితే ఏదో ఘోరం జరిగిపోయినట్టు బాధపడతావేంటి! ఇంకా ఛాన్సెస్ వున్నాయి కదా! పట్టు వదలకుండా అనుకున్నది సాధించేవారకూ నిద్రపోకూడదు". అని మళ్లీ ఉత్తేజపరిచారు ప్రసాద్‌ని.

రెండోసారి రాతపరీక్షల్లో ఉత్తీర్ణుడైనాడు ప్రసాద్. ఇంటర్వ్యూలో కూడా సెలక్ట్ అయ్యాడు.

ఢిల్లీ రావడమే తన జీవితంలో పెద్ద మైలురాయి. స్థలం మారింది, దశ మారింది. ఆ ఉద్యోగం పరిమళ్‌గాడు చేజిక్కించుకుని, తనకి పరోక్షంగా సహాయం చేశాడు. అనుకున్నాడు ప్రసాద్.

హైదరాబాద్‌లో పోస్టింగ్ వచ్చింది. ఐ.ఏ.ఎస్ ప్రొబేషనర్‌గా జాయినయ్యాడు.

ప్రసాద్ తల్లిదండ్రులు చాలా సంతోషించారు. తల్లి అంది - "నీ మనస్సు ఒక పువ్వురా! అది కూడా వాసనలేని పువ్వు కాదు! పరిమళాలు వెదజల్లే పువ్వు! అందుకే నీకింత పెద్ద ఉద్యోగం వచ్చింది."

ఒకసారి పరిమళ్‌గాడ్ని కలిసి వస్తానని అతని యింటికి వెళ్లాడు.

"కంగ్రాట్స్ మిస్టర్ ప్రసాద్ ఒక్కొక్కసారి డబ్బు లేకపోవడం వలన కూడా, మేలు జరుగుతుంది!" అన్నారు పరిమళ్ నాన్నగారు.

"ఏదో అంతా మీలాంటి పెద్దల ఆశీర్వచనం!" అన్నాడు ప్రసాద్.

"పరిమళ్ ఇప్పుడే వస్తాడు! ఈలోపు కాఫీ తాగు" అని కాఫీ తెప్పించారు లోపల్నుంచి.

పరిమళ్ వస్తూనే ప్రసాద్‌ని కౌగిలించుకున్నాడు.

"అసలు సివిల్స్‌ని ఎలా సాధించావురా! చాలా కష్టం!" అన్నాడు పరిమళ్.

"దేవుని దయ వుంటే ఏదీ కష్టం కాదు. మాకు లక్ష్మీ కటాక్షం లేదు. అత్తా కోడళ్లకి పడదు. లక్ష్మి లేని చోటనే సరస్వతి ఉంటుంది" అన్నాడు - నవ్వుతూ ప్రసాద్.

"ఢిల్లీ వెళ్ళిన తర్వాత మాటలు బాగానే నేర్చావు రా!" నే చేసిన తప్పు క్షమించరా!"

"మచ్చలేని చంద్రుడు, తప్పులేని స్నేహితుడు ఉండరు. అసలు తప్పులేని స్నేహితుడే కావాలనుకుంటే స్నేహితుడే దొరకడు. అన్నాడు, ప్రసాద్.

పరిమళ్ నాన్నగారికి వ్యాపారంలో చాలా నష్టం వచ్చింది. కష్టాలన్నీ ఒక్కసారి, వచ్చాయి. ఒకసారి పరిమళ్ రూపాయలు బ్యాంక్‌లో కంపెనీ సొమ్ము ఓ లక్ష జమచేద్దామని

వెళుతూంటే, దార్లో దొంగతనం జరిగింది. ఆ నష్టం భర్తీ చేయ్యలేకపోవడం వలన ఉద్యోగంలోంచి తీసేసారు. పరిమళ్ నాన్నగారికి, వ్యాపారంలో నష్టం రావడం వలన కంపెనీ డబ్బు మాయం చేసుంటారనుకున్నారు ఆ కంపెనీవాళ్లు.

ఓ రోజు ప్రసాద్‌ని కలిసి ఎక్కడైనా చిన్న ఉద్యోగమైనా యిప్పించమన్నాడు పరిమళ్. "ఈ హైదరాబాద్‌లో నీకు ఉద్యోగం రావడం కష్టం ఎందుకంటే మీ కంపెనీలో డబ్బు పోయినట్లు పేపర్లో వచ్చింది కదా! సాయంకాలం రా! మా నాన్నగారితో చెప్పి నిన్ను కూడా ఆయన స్నేహితుని దగ్గరికి ఢిల్లీ పంపిస్తాను. నేను కొంత డబ్బు సహాయం కూడా చేస్తాను! నువ్వు కూడా సివిల్స్ రాయి. ఢిల్లీలో అయితే మంచి కోచింగ్ వుంటుంది". అన్నాడు ప్రసాద్.

పరిమళ్ తన స్నేహితుని గొప్పతనానికి ఆశ్చర్యపోయాడు. వెడుతూంటే ప్రసాద్ అమ్మగారు "నువ్వూ ప్రసాద్ నాకు వేరుకాదు! ఈ వెయ్యి రూపాయలు వుంచుకో!" అని ఆప్యాయతగా భుజం తడుతూ పరిమళ్‌కి డబ్బు యిచ్చింది.

పరిమళ్‌కి కళ్ళల్లో నీళ్లు తిరిగాయ్. ఆవిడ కాళ్లకి దండం పెట్టాడు.

"ఉండ్రా కార్లో దింపుతాను!" అంటూ ప్రసాద్ కూడా బయలుదేరాడు.

అంత పెద్ద ఉద్యోగంలో ఉన్నా ఏ మార్పు లేకుండా పూర్వంలా స్నేహంగా వుంటూ, తన కొడుకుని కార్లో దింపిన ప్రసాద్‌ని చూసి ఆశ్చర్యపోయాడు పరిమళ్ నాన్నగారు.

"ఇతనికా నేను ద్రోహం చేశాను! అందుకే కాబోలు నా వ్యాపారంలో నష్టాలొచ్చాయి! పరిమళ్ ఉద్యోగం కూడా పోయింది." అని సిగ్గుతో బాధపడ్డారు.

"అంకుల్! ఏం కంగారు పడకండి. అన్నీ సర్దుకుంటాయి." అని ఆయనికి ధైర్యం చెప్పి వెళ్ళాడు ప్రసాద్.

తర్వాత ప్రసాద్ చేసిన ఆర్థిక సహాయం చాలా తోడ్పడింది. పరిమళ్ కూడా ఢిల్లీ వెళ్ళి ఉద్యోగంలో చేరాడు. కష్టపడి సివిల్స్ సాధించాడు.

"సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్!" అన్నాడు పరిమళ్ తన తండ్రితో.

"అవున్రా నిజమే! మీ యిద్దరి స్నేహం మరీ వెర్రి తీపిసుమా!" అన్నారాయన సంతోషంతో.

- రంజని (ఉగాది 2008)